క్లుప్తంగా

విశేషాలంకారంలో రంగనాథుడు



నెల్లూరు(బృందావనం): అధ్యయనోత్సవాల్లో భాగంగా నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో రాపత్తు ఉత్సవాన్ని వేడుకగా బుధవారం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు జగన్నాథాచార్యులు, సుదర్శనాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. వైకుంఠ ద్వారంలో మూలవర్లను భక్తులు దర్శించుకున్నారు. విశేషాలంకారంలో స్వామివారు దర్శనమిచ్చారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పర్యవేక్షించారు.

హుండీ కానుకల లెక్కింపు

వైకుంఠ ఏకాదశి సందర్భంగా రంగనాథుడి దేవస్థానంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీలకు సంబంధించిన కానుకలను లెక్కించారు. కానుకల రూపంలో భక్తులు రూ.7,34,625 మేర సమర్పించారని ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. టికెట్ల విక్రయం ద్వారా రూ.11,77,850 మేర లభించిందన్నారు. పూడిపర్తి గ్రూప్ దేవస్థానాల ఈఓ రవీంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(సెంట్రల్): రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకుడు ధనుంజయరెడ్డి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి



మాట్లాడుతున్న హరిత

నెల్లూరు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులకు అందాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. నగరంలోని 28వ డివిజన్లో గల మూడో నంబర్ సచివాలయాన్ని బుధవారం తనిఖీ చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. ఆస్తి పన్నులు, యూజర్ చార్జీలను వేగవంతంగా వసూలు చేయాలని ఆదేశించారు. జగనన్న భూ హక్కు పథకంలో భాగంగా రీ సర్వేను వెంటనే ప్రారంభించాలని సూచించారు. విధుల్లో క్రమశిక్షణతో వ్యవహరించాలని కార్యదర్శులకు సూచించారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం

• ఎస్పీ విజయారావు



చెక్కును అందజేస్తున్న విజయారావు

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణలో మృతి చెందిన పోలీస్ సిబ్బంది కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని ఎస్పీ విజయారావు పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ పోలీస్ స్టేషన్లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న భాస్కర్ రోడ్డు ప్రమాదంలో గతేడాది మృతి చెందారు. ఈ క్రమంలో జీపీఏఐ ద్వారా మంజూరైన రూ.20.9 లక్షల మొత్తాన్ని చెక్కు రూపంలో మృతుడి సతీమణి శారదకు ఎస్పీ తన చాంబర్‌లో బుధవారం అందజేశారు. అనంతరం కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఏఎస్పీ హిమవతి, ఎస్‌ఈబీ జేడీ శ్రీలక్ష్మి, ఏఓ విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి రాగితీగల చోరీ

పొదలకూరు : దుగ్గుంటరాజుపాళెం గ్రామానికి సమీపంలో తెలుగుగంగ కాలువ పక్కనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి అందులోని రాగితీగను చోరీ చేసినట్లు మంగళవారం రాత్రి రైతులు, సిబ్బంది గుర్తించారు. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు.. సుమారు రూ.లక్ష విలువైన ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి అందులో ఉన్న రాగివైరును అపహరించుకుని వెళ్లారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ కింద 8 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. విద్యుత్ మోటార్ల ద్వారా 30 ఎకరాల వరిపైరుకు రైతులు సాగునీటిని పెట్టుకుంటున్నారు. కాగా దీనిపై కండలేరు డ్యామ్ పోలీస్‌స్టేషన్లో విద్యుత్ సిబ్బంది ఫిర్యాదు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. 38వ డివిజన్లోని యర్రకట్ట ప్రాంతంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిపై స్థానికులకు కరపత్రాలను అందజేశారు. సమస్యలను ఆరాతీసిన అనంతరం ఆయన మాట్లాడారు. దేశానికే ఆదర్శవంతంగా సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల వారికి పథకాలను అందించే అంశంలో తాను అంకితభావంతో పనిచేస్తున్నానని చెప్పారు. అర్హులై పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్పొరేటర్ అమృత, అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సైదానీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

సలహాలు, సూచనలతో ముందుకెళ్తా



నెల్లూరు రూరల్: నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో గల తటస్థుల సూచనలు, సలహాలతో ప్రజల్లోకి వెళ్తానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. 41వ డివిజన్లోని పరమేశ్వరినగర్‌లో నిర్వహించిన తటస్థుల దీవెన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీలకతీతంగా సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యమని చెప్పారు. ఎమ్మెల్యేగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలనేదే తన ఉద్దేశమని తెలిపారు. సమావేశానికి హాజరైన వారి నుంచి ఆశీస్సులను అందుకున్నారు. అనంతరం వారితో కలిసి ఆత్మీయ విందుకు హాజరయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కార్పొరేటర్ విజయలక్ష్మి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు మురళీకృష్ణయాదవ్ పాల్గొన్నారు.

నగరాభివృద్ధే లక్ష్యం



పార్కును ప్రారంభిస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరాభివృద్ధే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. 54వ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరపురం మసీదు వద్ద దాదాపు రూ.28 లక్షలతో నిర్మించిన పార్కును బుధవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. పార్కులో వాకింగ్ ట్రాక్‌ను సైతం ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమన్నారు. ఎక్కడా రాజీ పడకుండా అన్ని పార్కులను అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్లు సఫియాబేగం, సుజాత, నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు జమీర్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దల పండగకు విస్తృత ఏర్పాట్లు



చర్చిస్తున్న ఎమ్మెల్యే అనిల్

నెల్లూరు(బృందావనం): బోడిగాడితోటలో నిర్వహించనున్న పెద్దల పండగకు సంబంధించిన ఏర్పాట్లను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెద్దల పండగ నేపథ్యంలో పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. వచ్చే ఏడాదికి నాలుగు వరుసల రహదారి నిర్మాణం పూర్తయి ఉంటుందని, బోడిగాడితోటను అభివృద్ధి చేసి పెద్దల పండగను మరింత ఘనంగా నిర్వహించేలా చర్యలు చేపడతామని వివరించారు. పండగకు హాజరయ్యే వారికి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు, పార్కింగ్ వసతిని కల్పించాలని అధికారులకు సూచించారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు దిక్సూచి



జిల్లా ఉపాధి కార్యాలయం



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు (ఫైల్)

• ఉద్యోగాల కల్పనకు వేదికగా జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం
• రిజిస్ట్రేషన్ తప్పనిసరి

నెల్లూరు(మినీబైపాస్): ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం నిరుద్యోగుల పాలిట వరంలా నిలుస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలకు సంబంధించిన ఖాళీల వివరాలను ఈ శాఖ తెలియజేస్తోంది. నిబంధనల మేరకు ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఆయా రంగాల్లో ఉద్యోగాల కల్పనలో ప్రాధాన్యమివ్వాల్సి ఉంటుంది. వాస్తవానికి ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు సంపాదించాలంటే అర్హతలతో పాటు ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి. ఇందులో సీనియార్టీ ప్రాతిపదికన అభ్యర్థులకు ప్రాధాన్యమిస్తారు.

ఇదీ ఉపయోగం..

పాత రిజిస్ట్రేషన్ రెన్యువల్, విద్యార్హతల నమోదు, తదితర పనుల కోసం జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగులు ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయాన్ని రోజూ పెద్ద సంఖ్యలో ఆశ్రయిస్తుంటారు. రెన్యువల్ గడువు దాటిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను మరోసారి పునరుద్ధరించుకునేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

రెన్యువల్ ఇలా..

రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ మూడేళ్ల కాల పరిమితిని కలిగి ఉంటుంది. గడువులోపు అభ్యర్థి పాత రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను సమర్పించి.. మరోసారి కొత్త రిజిస్ట్రేషన్ పొందాలి. కాలపరిమితి ముగిసినా మరో ఆర్నెల్ల గడువు సర్టిఫికెట్‌కు ఉంటుంది. ఒకవేళ అభ్యర్థి రిజిస్ట్రేషన్ గడువు తేదీ దాటి ఆర్నెల్ల నుంచి మూడేళ్లలోపు అయితే ప్రభుత్వం కల్పించిన ప్రత్యేక జీఓతో రెన్యువల్ చేస్తారు. అలా కాని పక్షంలో సీనియార్టీ కోల్పోయి మరోసారి కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఉపాధి కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల వివరాలు..

నమోదు చేసుకున్న అభ్యర్థులు (గతేడాది జనవరి నుంచి నేటి వరకు):	4071
యువకులు :	1401
యువతులు :	2670
జాబ్‌మేళాలు :	23
హాజరైన కంపెనీలు:	94
ఉద్యోగ మేళాకు నమోదు చేసుకున్న వారు :	6532
ఉద్యోగాలు సాధించిన వారు :	511

రిజిస్ట్రేషన్లపై అవగాహన కల్పిస్తున్నాం



జిల్లా ఉపాధి కార్యాలయ ఆధ్వర్యంలో జాబ్‌మేళాలతో పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుంది. నమోదు విషయమై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. 4071 మంది అభ్యర్థులు జిల్లా ఉపాధి కార్యాలయంలో నమోదు చేసుకున్నారు.

– సురేష్‌కుమార్, జిల్లా ఉపాధి అధికారి

కొత్తగా రిజిస్ట్రేషన్ ఇలా..

అభ్యర్థి తన విద్యార్హతను తెలియజేసే ధ్రువపత్రం, కుల ధ్రువీకరణ పత్రం (ఓసీలు మినహా) ఒరిజినల్స్‌తో జిల్లా ఉపాధి కార్యాలయానికి హాజరుకావాలి. ఈ నిబంధన పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ అభ్యర్థులకు వర్తిస్తుంది. పాఠశాల విద్యాభ్యాసమైతే స్కూల్ సర్టిఫికెట్, మార్కు లిస్ట్‌తో పాటు టీసీ తప్పక ఉండాలి. ఇతర జిల్లాలకు చెందిన అభ్యర్థులు నివాస ధ్రువపత్రాన్ని జత చేయాలి. ఒరిజినల్ ధ్రువపత్రాలను పరిశీలన నిమిత్తం కార్యాలయంలో అందజేయాలి. ఉపాధి, శిక్షణ శాఖ ముద్రించిన దరఖాస్తును అభ్యర్థి పూరించాల్సి ఉంటుంది. దరఖాస్తు పరిశీలన అనంతరం ఆన్‌లైన్లో వివరాలను సిబ్బంది పొందుపరుస్తారు. అదే రోజు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను అభ్యర్థులకు అందజేస్తారు.

లక్ష తులసీ అర్చన రేపు

నెల్లూరు(బృందావనం): ధనుర్మాస పౌర్ణమిని పురస్కరించుకొని సుజాతమ్మ కాలనీలోని కృష్ణయోగ మందిరంలో లక్ష తులసీ అర్చనను శుక్రవారం నిర్వహించనున్నామని గణపతి సచ్చిదానంద కృష్ణ జ్ఞానబోధ సభ ట్రస్ట్, నెల్లూరు ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ అజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30కు లక్షతులసీ అర్చన, పదికి రుద్రహోమం, 11కు అష్టలక్ష్మి హోమాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు. పూజల్లో పాల్గొనాలనుకునే భక్తులు తమ పేర్లను మందిరంలోని కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

నేత్రదానం



కమలమ్మ (ఫైల్)

నెల్లూరు(అర్బన్): కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన కమలమ్మ (68) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. కుటుంబసభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్రదాన మోటివేటర్లు బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. అనంతరం ఆమె కుటుంబసభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99481 64781, 93471 11033 నంబర్లను సంప్రదించాలని బాలాజీసింగ్ కోరారు.

టౌన్‌ప్లానింగ్‌లో చైన్‌మెన్ల బదిలీ

నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న ఏడుగురు చైన్‌మెన్లను బదిలీ చేస్తూ కమిషనర్ హరిత ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. శశికల్యాణ్‌ను కమిషనర్ పేషీకి, వెంకటరమణను టీపీఆర్వో సెక్షన్‌కు, నారాయణను పబ్లిక్ హెల్త్ విభాగానికి, మల్లికార్జునరావు, దస్తగిరిబాషా, బాబూరావును ఇంజినీరింగ్ విభాగానికి, శేషారెడ్డిని హెచ్ విభాగానికి బదిలీ చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(విఆర్సీసెంటర్): ఏకేనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఏపీ టూరిజం ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా గురువారం ఉండదని వెస్ట్ – 1 సెక్షన్ ఏఈ లక్ష్మీబాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండాయపాళెం గేట్, మిలటరీ కాలనీ ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు.

7, 8న సంగీత, సాహిత్య కార్యక్రమాలు

నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని ఏసీ హాల్లో విశిష్ట సంగీత, సాహిత్య కార్యక్రమాలను శని, ఆదివారాల్లో నిర్వహించనున్నామని పద్యకళాపరిషత్ అధ్యక్షుడు రామచంద్రప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కవి సమ్మేళనం, వెంకటేశ్వర భక్తిఛానల్ చైర్మన్ సాయికృష్ణ యాచేంద్రతో సంగీత గేయధార కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నామని చెప్పారు. సాహితీప్రియులు హాజరుకావాలని కోరారు.

రామ్‌కుమార్‌రెడ్డితో పలువురి భేటీ



నెల్లూరు(సెంట్రల్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, పార్టీ ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకుడు ధనుంజయరెడ్డి వేర్వేరుగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలను తెలియజేశారు.

నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

• నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్): నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని, సంక్రాంతి సందర్భంగా పేకాట, కోడిపందేలు, అశ్లీల నృత్యాలను ప్రదర్శిస్తే చర్యలు తప్పవని నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు నగరంలోని తన కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహన తనిఖీలను రోజూ సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8.30 వరకు నిర్వహించనున్నామని చెప్పారు. గస్తీని ముమ్మరం చేశామని, రౌడీషీటర్లు, అసాంఘిక శక్తుల కదలికలపై నిఘాను పెంచామన్నారు. రోజూ రాత్రి వారిని తనిఖీ చేస్తామని, నేరాలకు తరచూ పాల్పడుతున్న వారి జాబితాను సిద్ధం చేస్తున్నామని.. త్వరలోనే వారిపై రౌడీషీట్లను తెరవనున్నామని చెప్పారు. నిరంతరం తనిఖీలు చేస్తూ బహిరంగంగా మద్యాన్ని సేవిస్తున్న వారిపై కేసులను నమోదు చేస్తున్నామన్నారు. సంక్రాంతి సందర్భంగా ఊళ్లకెళ్లే వారు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒంటరిగా బయటకెళ్లే మహిళలు బంగారు ఆభరణాలు కనిపించకుండా జాగ్రత్తలు వహించాలని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నా.. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని తెలిసినా డయల్ 100, 94407 96303 లేదా స్థానిక పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. నేర నియంత్రణకు తాము చేపడుతున్న చర్యలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మైదానాల్లో సభలు పెట్టుకోండి



సంక్షేమ పథకాలపై కరపత్రాలను అందజేస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్

• టీడీపీ నేతలకు ఎమ్మెల్యే అనిల్ హితవు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): బలం నిరూపించుకోవాలంటే మైదానాల్లో సభలను నిర్వహించుకోవాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ టీడీపీ నేతలకు హితవు పలికారు. నాలుగో డివిజన్లోని శ్రీనివాసనగర్ మూడో, నాలుగో వీధులు, పరిసర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టీడీపీపై అభిమానం ఉంటే సభలను మైదానాల్లో పెట్టినా ప్రజలు వస్తారని.. అయితే వారు రారనే భయంతో రోడ్లపై నిర్వహించి 11 మందిని పొట్టనబెట్టుకున్నారని ధ్వజమెత్తారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ప్రతి ఇంటికీ వెళ్లి తెలుసుకున్నామని చెప్పారు. అందని వారి నుంచి కారణాలను తెలుసుకొని పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. డివిజన్లలోని చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని వివరించారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ ప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం



పార్టీలో చేరిన వారితో గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానాన్ని కల్పిస్తామని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ధనలక్ష్మీపురంలో నిర్వహించిన కార్యక్రమంలో కేజీఎఫ్ స్వచ్ఛంద సంస్థకు చెందిన వంశీ, సాయి, మురళి, వారి మిత్రబృందం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించిన అనంతరం ఆయన మాట్లాడారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లోనూ భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. రూరల్ ఎంపీపీ విజయ్‌కుమార్, నేతలు కేశవులు, చక్రవర్ధన్‌రెడ్డి, సునీల్, శివసునీల్‌రెడ్డి, శేషు, నాగరాజు, విజయభాస్కర్, మాదరాజు గూడూరు సర్పంచ్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ



నెల్లూరు(విఆర్సీ సెంటర్): పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్లను సంస్థ రాష్ట్ర సెక్రటరీ జనరల్ శేషారెడ్డి, నెల్లూరు సర్కిల్ సెక్రటరీ దామోదర్ ఆధ్వర్యంలో విద్యుత్ భవన్‌లో బుధవారం ఆవిష్కరించారు. అనంతరం వీటిని వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా సెక్రటరీ శివయ్యకు అందజేశారు.